క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



చిన్నంబావి: మండలంలోని బెక్కెం గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన పాల భాస్కర్‌రెడ్డి ఆదివారం మండలంలోని కొప్పునూరులో జరిగే వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. బుధవారం రాత్రి ఇంటి లోపల నుంచి కాలిపోయిన వాసన రావడంతో స్థానికులు ఇంటి యజమాని భాస్కర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వచ్చి చూసేసరికి ఇంటి లోపల విలువైన సామాన్లు కాలిపోయాయి. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

లారీ బోల్తా: తప్పిన ప్రమాదం



పాన్‌గల్: మైనింగ్ నుంచి రాయి లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేమద్దులలోని మైనింగ్ నుంచి రాయి లోడ్‌తో కోడేర్ మండలం సింగాయిపల్లి వైపు వెళ్తున్న లారీ గ్రామ శివారులోని నల్లకుంట కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా కిందకు దూకడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

టీయూసీఐ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్

అమరచింత: టీయూసీఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని మహాసభల అనంతరం ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా ఎదుట్ల కుర్మయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా సామేల్, కుర్మన్న, ప్రేమరత్నం, శ్రీను, చెన్నయ్య, కిష్టన్న, షాహేద, సుబ్బయ్య, రాజు, రంగన్న, యేసేపుతో పాటు కోఆప్షన్‌ను ఎన్నుకున్నారు. ఈమేరకు చేపట్టాల్సిన కార్యక్రమాల తీర్మానాలను ఆమోదించామన్నారు.

బాలిక అదృశ్యం



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన నిడుకొండ కాళిదాసు, పావనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె సంధ్య (7) ఈనెల 4 నుంచి కనిపించడం లేదు. చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా సమాచారం దొరకలేదు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ ఆనంద్ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే జీఎమ్మార్ రాక

కొత్తకోట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు, మిరాసిపల్లికి 11గంటలకు కొత్తకోటకు రానున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం

గద్వాల: జిల్లాలో సీడుపత్తి రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీడు కంపెనీలు, ఆర్గనైజర్లు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. సీడుపత్తి విత్తనాలను జీవోటీ ఫలితాల్లో పాస్ అయినప్పటికీ ఫలితాలు తారుమారు చేసి ఫెయిలైనట్లు చూపెడుతూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో సీడుపత్తి రైతులకు జరుగుతున్న అన్యాయంపై తమ పార్టీ నాయకుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన నేరుగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కోదండరెడ్డి ఆధ్వర్యంలో రైతు కమిషన్ బృందం శుక్రవారం గద్వాలలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, రాము, ముద్ద తిమ్మప్ప, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సోళీపురంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓ జయశంకర్



పెద్దగూడెం పాఠశాలలో..



మదనాపురం అంగన్‌వాడీ కేంద్రంలో..

బడిగంట మోగింది

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కార్ బడుల్లోనే చదివించాలని విద్యాధికారులు సూచించారు. గురువారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగత ఏర్పాట్లు చేశారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, నోట్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు.

- పాన్‌గల్ మండలంలోని బహదూర్‌గూడెం ప్రాథమిక పాఠశాల, కేతేపల్లి ఉన్నత పాఠశాలను ఎంఈఓ శ్రీనివాసులు సందర్శించి విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో మొదటి రోజు 11 మంది విద్యార్థులు నూతనంగా బడిలో చేరినట్లు హెచ్‌ఎం పద్మ పేర్కొన్నారు. వారందరూ ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన వారేన్నారు.
- పెబ్బేరు పట్టణ కేంద్రంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు ఆధ్వర్యంలో హెచ్‌ఎం చిన్నరాములు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ శివపార్వతి విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేశారు.



పెబ్బేరు చెంచువాడ పాఠశాల గేటు వద్ద విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

- వనపర్తి మండలంలోని పెద్దగూడెం, చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వరలక్ష్మి, గణేష్‌కుమార్, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థు నోట్ బుక్కులు, పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, గిరిజాచారి తదితరులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం మండలంలోని 26 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 6ఉన్నత పాఠశాలలతో పాటుగా 2 కేజీబీవీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాల, మోడల్ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈఓ జయశంకర్ తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు.
- అమరచింత మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలను పునఃప్రారంభినట్లు ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు కరుణాకర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.
- మదనాపురం మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లల నమోదు కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పీడీ సుధారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మకూర్ ప్రాజెక్టు అధికారి లక్ష్మమ్మ, సూపర్‌వైజర్లు భారతి, నర్మద, అంగన్‌వాడీ టీచర్ అరుణ, శారదాదేవి, పుష్పావతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అజ్జకొల్లుతో పాటు ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగింది.
- అమరచింత మండల కేంద్రంలోని అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించే కార్యక్రమం చేపట్టామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద తెలిపారు.



అజ్జకొల్లులో..



పాన్‌గల్ పీఎస్‌లో..



అమరచింతలో..

'రైతు భరోసా' కు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట: కొత్తగా పట్టాలు పొందిన రైతులు వానాకాలం 2025కు గాను రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లను తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. గతంలో రైతు భరోసా ద్వారా డబ్బులు వచ్చిన రైతులు కొత్తగా ఎటువంటి డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. జూన్ 20వ తేదీ లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఛత్రపతి శివాజీ సేవలు కొనసాగిద్దాం



వీపనగండ్ల: హిందువులు మతాన్ని మార్చుకోవడం వల్ల హిందూ మతానికి నష్టం వాటిల్లుతుందని జిల్లా ధర్మజాగరణ సహసంయోజక్ నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేకం కార్యక్రమాన్ని పురస్కరించుకొని గోవర్ధనగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. హిందూజాతి అభివృద్ధికి కృషి చేసిన ఛత్రపతి శివాజీ సేవలను హిందువులుగా మనందరం కొనసాగించాలన్నారు. దేశంలో హిందూ మతాన్ని పరిస్థితులు నెలకొంటున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని హిందువులు మత మార్పిడికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాకేశ్‌యాదవ్, బాలగౌడ్, నారాయణరెడ్డి, గట్టు శేఖర్, కోటేష్‌యాదవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నూనెగింజల సాగుతో అధిక లాభాలు



పామిరెడ్డిపల్లిలో రైతులకు అవగాహన చేస్తున్న శాస్త్రవేతలు

కొత్తకోట రూరల్: రైతులు వరికి ప్రత్యామ్నాయంగా నూనె గింజల సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వారు పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో రైతులు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, నువ్వుల పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు రావడంతో పాటు భూసారం పెరుగుతుందని వారు సూచించారు. అనంతరం రైతులకు ఆముదం విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త అనిత, నూనె గింజల పరిశోధన స్థానం హైదరాబాద్‌శాస్త్రవేత్త శాంతలక్ష్మి, ఉద్యానవన అధికారి శ్రీకాంత్, వెటర్నరీ డాక్టర్లు శ్యాం, జగదీష్, ఏఈఓ మధు, అర్చన తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: అధిక లాభాల కోసం రైతులు నూనెగింజలు, పప్పు దినుసుల పంటలను సాగు చేయాలని జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ డా.లక్ష్మమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని రేమద్దులలో వానాకాలం పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, పశువైద్యాధికారి డా.సురేష్, ఉద్యానవన అధికారి కృష్ణయ్య, ఏఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేయాలి

వనపర్తి రూరల్: రైతులు పంటను విత్తుకోవడానికి ముందు ఖచ్చితంగా విత్తనశుద్ధి చేసుకోవాలని శాస్త్రవేత డాక్టర్ శ్రీరామ్ సూచించారు. మండలంలోని నాగవరం రైతువేదిక వద్ద ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శాస్త్రవేతలు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ కురుమయ్య మాట్లాడుతూ రసాయన ఎరువులు, యూరియా వాడటం, పంటమార్పిడి, సాగునీటి పొదుపు, నాణ్యమైన విత్తనాల ఎంపికపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు కవిత, వంశీ,ప్రభావతి, శ్రీనివాసశ్రీకాంత్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: పంట దిగుబడి పెంచుకునేందుకు అవసరమైన సూచనలు ఎప్పటికప్పుడు రైతులకు అందించాలని కేవీకే, మదనాపురం శాస్త్రవేత్త రాజేంద్రకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికతో పాటు చెన్నూరు గ్రామ పంచాయతీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగుపై సలహాలు అందించారు. కార్యక్రమంలో జాతీయ నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త మంజునాథ్ పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ఖనిజ సంపద దోచిపెట్టేందుకే..



వనపర్తి రూరల్: కార్పొరేట్లకు ఖనిజ సంపదను దోచి పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కంగార్ చేపడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో 35 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. రైతు భరోసా నాలుగు ఎకరాలు ఉన్న రైతుల వరకే వేశారని, మిగిలిన రైతులకు రైతు భరోసా సొమ్ము జమ చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ వికాసం పథకానికి అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. ప్రజలు, రైతుల సమస్యలపై పోరాటానికి సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంద్రయ్య, అబ్రహం, సీఎస్ శెట్టి, రవీందర్, భాస్కర్, గోపాలకృష్ణ, కుతుబ్, శ్రీహరి, కుర్మయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో నిర్వహిస్తున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు వినియోగించుకొని, పరీక్షలు చేయించుకోవాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. గురువారం కేతేపల్లి సబ్‌సెంటర్ పరిధిలో జిల్లాలోని అనుభవజ్ఞులైన వైద్య బృందం, ఎన్‌జీఓ టీం సభ్యుల సహకారంతో డయాబెటీస్, బీపీ, హిమోగ్లోబిన్, క్షయ వ్యాధి నిర్ధారణకు తెమడ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, హెపటైటిస్–బీ మొదలగు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు తారశశాంక్, మైథిలీ, ఎన్‌జీఓ టీం అలిబాబు, పద్మ, కల్పన, రమాదేవి, హెచ్‌ఐవీ టీం బండారి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, క్షయవ్యాధి బృందం ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఖాజా, నగేష్, రహ్మాన్, వైద్య సిబ్బంది సుమనశ్రీ, శ్రీలక్ష్మి, రాంచంద్రయ్య, సతీష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఎకరాకు రూ.11.65 లక్షలే..



మాట్లాడుతున్న రైతులు

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామన్న మేఘారెడ్డి హామీలు ఏమయ్యాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, రైతులు దేవరశెట్టి వెంకటయ్య, సొడం మురళీధర్, సొడం రాములు, కోరమోని దేవేందర్, రాంరెడ్డి ప్రశ్నించారు. గురువారం వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి తనను గెలిపిస్తే గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఎకరాకు రూ.11.65 లక్షలు ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడ్, ప్రతాప్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నజర్



చిన్నంబావిలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు (ఫైల్)

- ఏటా మోసపోతున్న రైతులు
- ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాతలు
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

చిన్నంబావి: రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే కొందరు జొన్న, కంది విత్తనాలు విత్తారు. మరికొంత మంది వరి సాగు చేసేందుకు కరిగెట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో విత్తనాలు ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కొందరు కేటుగాళ్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అమాయక రైతులే టార్గెట్

మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతం ఎక్కువ కావడంతో రైతులు విభిన్న రకాల పంటలు సాగు చేస్తారు. రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు ఉండటంతో సులువుగా వారిని మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. ఇక్కడి రైతులకు కర్నూల్, నందికొట్కూరు ప్రాంతాల నుంచి వచ్చే దళారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. గతంలో నకిలీ విత్తనాలు సాగుచేసి మోసపోయిన రైతులూ ఉన్నారు. మండల కేంద్రంలో ఇబ్బడిముబ్బడిగా దుకాణాలు వెలవడటంతో లాభార్జన కోసం నకిలీ మందులు, విత్తనాలను అందజేసినట్లు గతంలో పలు ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు తప్పకుండా రశీదులు తీసుకోవాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మండలంలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో అన్నదాతలు ఎక్కువగా వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. వానలు పడితేనే విత్తనాలు విత్తుకుంటారు. దీంతో రైతులకు నకిలీ విత్తనాలు కట్టబెడితే వేసిన విత్తనాలు మొలకెత్తకపోతే ఆర్థికంగానూ, సమయంపరంగానూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాపులోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- ప్యాకెట్‌పై లేబుల్ చూడాలి. విత్తన ప్యాకెట్ ధ్రువీకరణ నంబర్, తేదీ, విత్తన రకం వంటి వివరాలు చూసుకోవాలి
- రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

అవగాహన కల్పిస్తున్నాం

మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు, ఫర్టిలైజర్ షాపు యజమానులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నాం. విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మురళి, మండల వ్యవసాయ అధికారి

చర్యలు తీసుకుంటాం



రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు అమ్మినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు అమ్మడం నేరం. విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. వ్యాపారస్తులు తమ దుకాణాల ఎదుట వ్యవసాయాధికారులు, పోలీస్ అధికారులు మొబైల్ నంబర్లను ఏర్పాటు చేయాలి.

– జగన్మోహన్, ఎస్‌ఐ, చిన్నంబావి

రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందరావు

పాన్‌గల్: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్లాంటేషన్ రిజిస్టర్లు, రోజ్‌గార్‌దివాస్ రిజిస్టర్, నర్సరీల నిర్వహణ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. చేపట్టే పనులు నాణ్యతగా, రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. నర్సరీల్లో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈసీ అంజన్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



నాచహళ్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి

సాక్షి, నెట్‌వర్క్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రెవెన్యూ అధికారులు అన్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా అధికారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

- పాన్‌గల్ మండలంలోని మండలంలోని తెల్లరాళ్లపల్లిలో 23, కిష్టాపూర్‌లో 6 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. తెల్లరాళ్లపల్లిలో ఏన్నో ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పట్టా మార్పిడిలు వెంటనే చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీటీ అశోక్ కుమార్, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్ పాల్గొన్నారు.
- వనపర్తి మండలంలోని ఆర్.వెంకటాపురంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి 6, నాచహళ్లిలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి 8 దరఖాస్తులు స్వీకరించారు.
- పెబ్బేరు మండలంలోని కొత్తసూగూరులో తహసీల్దార్ మురళీగౌడ్ 23, తోమాలపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ 43 దరఖాస్తులు స్వీకరించారు.
- శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో తహసీల్దార్ బి రాజు రైతుల నుంచి 55 దరఖాస్తులు స్వీకరించారు.
- వీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరిలో రైతులు 78 దరఖాస్తులు అందించారని తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.